క్లుప్తంగా

శ్రీనివాస్‌కు నాయకుల నివాళి



శ్రీనివాస్‌కు నివాళులు అర్పిస్తున్న కోలా గురువులు, జాన్‌వెస్లీ, వాసుపల్లి

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు మహిళా అధ్యక్షురాలు వెల్లంకి చిన్నమ్మలు కుమారుడు శ్రీనివాస్ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన శ్రీనివాస్ పెద్ద కర్మ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ శ్రీనివాస్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ, స్టేట్ డైరెక్టర్లు ససపల రవీంద్రభరత్, రీసు అనురాధ, కాకి పద్మ, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, ముత్తాబత్తుల రమేష్, బొర్రా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన



వివిధ దేశాల్లో విద్యపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

సీతమ్మధార : స్టడీ కనెక్ట్ కన్సల్టెన్సీ నిర్వహించిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. శనివారం డైమండ్ పార్కు దరి ఒక హోటల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. యూఎస్‌ఏ, యూకే, కెనడా, యూరప్‌తో పాటు ఇతర దేశాలకు సంబంధించిన యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ పార్టనర్ బి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ హాస్టల్ సదుపాయాలు, విద్యా విధానం, వీసా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ : ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులను జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు లబ్ధిదారులకు అందజేశారు. శనివారం వార్డు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హులైన వారెవరూ కార్డు లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నార న్నారు. ఇందులో భాగంగానే జీవీఎంసీ 35వ వార్డులో ఆరు సచివాలయాల పరిధిలో 40 కొత్త రేషన్ కార్డులు మంజూరు కావడంతో వాటిని లబ్ధిదారులకు కార్పొరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు రెల్లి కులస్తుల ఆత్మీయ కలయిక

మహారాణిపేట : రాజకీయ ప్రాతినిధ్యం కోసం రెల్లి కులస్తుల ఆత్మీయ కలయిక ఆదివారం విశాఖలో నిర్వహించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువసేన అధ్యక్షుడు కస్తూరి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సమావేశం జరగనుంది. విశాఖ పరిసర ప్రాంతాల నుంచి రెల్లి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. ఎస్సీల్లో మాలలు, మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం ఉందని, కాని రెల్లి కులస్తులకు ఎలాంటి రాజకీయ ప్రాతినిధ్యం లేదని అధ్యక్షుడు వెంకటరావు అన్నారు.

అక్కచెల్లెమ్మలకు.. ఆర్థిక భరోసా

మహిళా సాధికారత అనే పదాన్ని గతంలో అనేక రాజకీయ పార్టీలు, నాయకులు వాడారు. అయితే నిజంగా అందుకు ఆ పార్టీలు, నాయకులు కృషి చేసింది లేదు. అందలం ఎక్కగానే ఆ సంగతి మరిచిపోవటం షరా మామూలుగానే జరుగుతుండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు చేయూత, ఆసరా, డ్వాక్రా రుణాలు, సున్నా వడ్డీ వంటి పథకాలు ప్రవేశపెట్టి.. ఆడపడుచులకు వెన్నుదన్నుగా నిలిచారు. వారు తమ కుటుంబాలకు బాసటగా నిలిచే చక్కటి అవకాశం కల్పించారు. అందుకే ఈరోజు రాష్ట్రంలోని మహిళలంతా సీఎం సంక్షేమ దృక్పథానికి జేజేలు పలుకుతున్నారు.

- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో ఆడపడుచులకు చేయూత
- హర్షం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు



సున్నా వడ్డీ పథకం ద్వారా లబ్ధి పొందినందుకు హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు, గోపీకృష్ణ, రమేష్

అల్లిపురం : రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకంతో అండగా నిలిచారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.1,353.76 కోట్లు జమ చేశారు. దీంతో రాష్ట్రంలో అన్ని డ్వాక్రా గ్రూపుల్లో మహిళలకు సున్నా వడ్డీ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. అక్కచెల్లెమ్మల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. స్వయం సహాయక సంఘాల ద్వారా పొందిన రుణాలు సకాలంలో చెల్లించే వారు వడ్డీ నుంచి ఉపశమనం పొందే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ వడ్డీ భారాన్ని తానే భరిస్తుంది. వారి తరఫున నేరుగా వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద స్వయం సహాయక బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసింది.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టింది. దీంట్లో భాగంగా మహిళలకు చేయూత, ఆసరా, డ్వాక్రా రుణాలు, సున్నా వడ్డీ పథకం తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు తమ కుటాంబానికి అండగా నిలివాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పని చేస్తున్నారు. జీవీఎంసీ పరిధి 33వ వార్డులో 367 గ్రూప్‌లకు రూ.58 లక్షల 99 వేల 602 లబ్ధి చేకూరింది. ఈ మేరకు డ్వాక్రా గ్రూపుల సభ్యులు 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ, మాదాబత్తుల రమేష్ సమక్షంలో శనివారం ఆనందం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..



ఇంటి అవసరాల నిమిత్తం డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలు తీసుకున్నాం. ఆ రుణాలపై వడ్డీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకం ద్వారా తిరిగి చెల్లించడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – శ్రీదేవి, స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు

ఆర్థికంగా భరోసా దొరికింది..



సున్నా వడ్డీ ద్వారా మాకు ఆర్థికంగా భరోసా లభించింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం మహిళల కోసం ఆలోచించే వ్యక్తి కావటం ఆనందంగా ఉంది. ఆయనకు రుణపడి వుంటాం.

– ప్రమీల, స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు

ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు



గత నాలుగేళ్లగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సున్నా వడ్డీ పథకం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందాం. మగవారితో సమానంగా కుటుంబ బాధ్యతలు పంచుకోగలిగే శక్తిని సీఎం జగన్ కల్పించారు. అందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు.

– భవానీ, స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు

మహిళలకు మంచి అవకాశాలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డే మా ధైర్యం.. ఆత్మవిశ్వాసమూను. ఆయన ఇచ్చిన భరోసాతోనే మేము కుటుంబాలను నెట్టుకు రావటానికి అంతో ఇంతో సంపాదించుకోగలుగుతున్నాం. ఆసరా, చేదోడు వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగే అవకాశం కల్పించారు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– కుసుమ, దేవసేన స్వయం సహాయక సభ్యురాలు

శ్రావణ మాసోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మర్రిపాలెం: ఈ నెల 17 నుంచి బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రావణ మాసోత్సవాల బ్రోచర్‌ను శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 53వ వార్డు మర్రిపాలెం రాణాప్రతాప్ నగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల పాటు అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఏడీ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం మాట్లాడుతూ నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రత్యేక కుంకుమ పూజలు, లక్ష్మీ హోమంలో పాల్గొనే భక్తులు రూ.400 రుసుం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ధర్మకర్తలు ధర్మకర్తలు బెహర వెంకటరత్నం, మళ్ల ధనలత, బుద్దల అనురాధ, సత్యవరపు సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సానబోయిన సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

డాబాగార్డెన్స్ : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. పాత నగరంలో గల విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. నగరంలో కామాక్షి అమ్మవారి కోవెలకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. నూతన కమిటీ చైర్మన్, నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గురజాపు రవి మాట్లాడుతూ కామాక్షి అమ్మవారి ఆలయం కోసం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధూపదీప నైవేద్యాల కోసం ప్రభుత్వం కేటాయించిన రూ. 5 వేలు ఇప్పించేలా, విశ్వబ్రాహ్మణులకు రూ.10వేలు జీవనభృతి ఇప్పించేందుకు సంఘ ప్రతినిధుల సహకారంతో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గురజాపు రవి, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు పాడుగు శ్రీనివాస్, నగర స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ముదపాక రవి, పెద్దపాటి బ్రహ్మాజీ, శేఖర్, రామోజు చినబాబు, పక్కి కొండబాబు, పొన్నాడ శ్రీను, పెదగాడ బాబ్జి, మరడాన నాగేశ్వరరావు, శివకోటి, కోట రమేష్‌తో పాటు కమ్యూనిటీ హాల్ బోర్డు డైరెక్టర్లు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మోదీ కొనసాగితే కష్టాలే

సీతమ్మధార : నరేంద్రమోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలు మరిన్ని కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభలు నిర్వహించారు. ముందుగా సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం సంక్షోభంలోకి వెళ్లిందని, 14 మంది ప్రధానులు రూ. 55 లక్షల కోట్లు అప్పులు చేస్తే మోదీ ఒక్కరే రూ. 155 లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని రుణభారత్‌గా మార్చారని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్, జిల్లా అధ్యక్షుడు పడాల రమణ, ఎం.మన్మథరావు, బి.వెంకట్రావు, షేక్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన శ్రీను



శ్రీను అంతిమ యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. జీవీఎంసీ 39వ వార్డు షాదీఖానా వద్ద శనివారం ఉదయం మత్యకార కుటుంబానికి చెందిన పిల్లా శ్రీను (38) వన్‌టౌన్ నుంచి టౌన్ కొత్త రోడ్డు వైపు రహదారి దాటుతుండగా పూర్ణామార్కెట్ నుంచి పాతపోస్టాఫీసు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను ప్రైవేటు సంస్థలో రోజు కూలీగా పని చేస్తున్నాడు. వన్‌టౌన్ ఎస్సై సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి చేయూత : ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన పిల్లా శ్రీను కుటుంబానికి జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆర్థికంగా చేయూతనిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని నష్టపరిహారం కోరుతూ ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడారు. తక్షణ సహాయంగా రూ. 10 వేలు ఇప్పించారు. ఆయన కూడా అంతిమ సంస్కారాల కోసం రూ. 10 వేలు శ్రీను కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మృతుని అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు

జగదాంబ : పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ అన్నారు. జీవీఎంసీ 39వ వార్డు రామకృష్ణానగర్‌లో శనివారం పర్యటించిన ఆయనకు ఆ ప్రాంత ప్రజలు పక్కనే ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని, లేని పక్షంలో ఆందులో నుంచి విషసర్పాలు వస్తున్నాయని చెప్పారు. అలాగే ఎక్కడ నుంచో కొందరు వ్యక్తులు, యువకులు వచ్చి అందులో మద్యం, గంజాయి సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు విషయం తెలియజేసి పార్కు అభివృద్ధికి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. పార్కు అభివృద్ధితో పాటు మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం తీసుకురావాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం గ్రీవెన్స్



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు కేజీహెచ్‌లో ఎఫ్ఎన్‌వోలుగా ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరిన మేరకు ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు ఫోన్ చేశారు. 33వ వార్డు బల్లిగిరి వేంకటేశ్వరస్వామి ఎండోమెంట్ ల్యాండ్ విషయమై ప్రత్యేక శ్రద్ధ చూపి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలకు కృషి చేస్తున్నందుకు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షుడు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, అలపన కనకరెడ్డి, నొల్లు పోతుస్వామి, పలు విభాగాల డైరెక్టర్లు సనపల రవీంద్ర భరత్, అమ్మాజీ, ప్రసాదరావు, అనురాధ, జేసీఎస్ నీలకంఠం, బెహరా వెంకటరత్నం, మీసాల అశోక్‌కుమార్, లింగం శ్రీను, లండా రమణ, ఆదివిష్ణు, బొగ్గు శ్యామ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి

డాబాగార్డెన్స్ : ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం కృష్ణరామసాయిచే నిర్వహించబడిన భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ యూత్ డే



విజేతగా నిలిచిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో శనివారం నేషనల్ యూత్ డే ఘనంగా నిర్వహించారు. సెట్విస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 'గ్రీన్ స్కిల్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, సెట్విస్ మేనేజర్ కేవీఎస్ఎన్ మూర్తి, ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు, సెట్విస్ సూపరింటెండెంట్ సూర్యప్రకాశరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి. కృష్ణకుమారి, లైబ్రరీ సైన్స్ విభాగధిపతి ఎం. స్వరాజ్యలక్ష్మి, అనిత, పద్మిని, కనకమహాలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

'సకల కళాకారుల' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉప అధ్యక్షుడిగా జె.ఎం.ఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్‌సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రీ శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతో పాటు మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ నగరంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలి

డాబాగార్డెన్స్ : శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిటు అఖిల భారత ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి. బేబీరాణి డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిటు శ్రామిక మహిళా విశాఖ జిల్లా సదస్సు ఎల్ఐసీ యూనియన్ నాయకురాలు సూర్యప్రభ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ శ్రామిక మహిళలు శ్రమకోర్చి తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం పని చేస్తుంటే ప్రభుత్వాలు వారిపై పని భారాలు మోపుతూ, వారికి ఏ విధమైన కార్మిక చట్టాలు అమలు చేయకుండా అత్యంత తక్కువ వేతనాలతో వారి శ్రమను దోచుకుంటున్నాయని ఆరోపించారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్యదర్శి పి. మణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తులసి, కార్యదర్శి దేవి, ఆశ యూనియన్ అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి మేరీ, మిడ్డేమీల్స్ యూనియన్ కార్యదర్శి మంగశ్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అనసూయ, బి. రత్నం, ఎం. కామేశ్వరి, అలివేణి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



విన్సెంట్ కుటుంబ సభ్యులకు నగదు సాయం చేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు సెబాస్టియన్ కాలనీలో నివాసముంటున్న సురుపిల్లి విన్సెంట్ శుక్రవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీధర్ శనివారం అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు విన్సెంట్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా త్వరితగతిన అందేటట్లు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగి జీరావు, ఈశ్వరి, కుమార్ పాల్గొన్నారు.

స్థానికులకే ఎంపీ సీటు కేటాయించాలి



మాట్లాడుతున్న ఆచార్య కె.ఎస్.చలం

సీతంపేట: ఏ రాజకీయ పార్టీ అయినా స్థానికులకే ఎంపీ అభ్యర్థి సీటు కేటాయించాలని మాజీ వీసీ, యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎవరు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇప్పటి వరకు 20 లక్షల కోట్ల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని, బయట నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులే ఈ పని చేశారని ఆరోపించారు. 1991 నుంచి స్థానికేతరులే విశాఖ ఎంపీగా ఎన్నికవుతున్నారని తెలిపారు. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ స్థానిక నాయకులు లేక ఇక్కడి సమస్యలపై ఎవరిని సంప్రదించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుల అవసరముందని, లేదంటే భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రొఫెసర్ అల్లు గౌరీశంకర్ మాట్లాడుతూ రెండు సామాజిక వర్గాలే రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, స్థానికేతరులు దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నారే తప్ప.. ఇక్కడి ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు, మాజీ జిల్లా జడ్జిలు పి.ముత్యాలనాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అరసం కార్యదర్శి అప్పలరాజు, సామాజిక ఉద్యమకారుడు ఎస్.వి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్ : విశ్రాంత పోలీస్ అధికారి మహ్మద్ ఖాన్ నెలకొల్పిన గీత్ సంగీత్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఓసి మనసా నీకు తెలుసా' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. బంగార్రాజు, మహ్మద్‌ఖాన్, నీలిమా రాణి, స్టీఫెన్, కల్యాణి, శివ కుమార్, సావిత్రి, జోసెఫ్, భాస్కర్, ఆంజనేయులు, అంజలి, నీహారిక, పద్మజ తదితర గాయనీ గాయకులు గీతాలు ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. కీ బోర్డుతో సోమేశ్, ఈశ్వరరావు, తబలాతో చక్రపాణి, అప్పలరాజు, ప్యాడ్స్‌తో బాబ్జి, బాబూరావు, జాజ్‌తో పైడిరాజు వాద్య సహకారం అందించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాక్ అప్పారావు, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీవిద్యకు అభినందనలు



డాక్టర్ శ్రీవిద్యను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ గురుప్రసాద్

మహారాణిపేట : ఇటీవల నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పీజీ పరీక్షలో డెర్మటాలజీ విభాగానికి చెందిన డాక్టర్ శ్రీవిద్య రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మార్కులు, ఏపీలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల శనివారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, చర్మ విభాగాధిపతి డాక్టర్ గురుప్రసాద్ డాక్టర్ శ్రీవిద్యను అభినందించారు. ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని డాక్టర్ సి.మల్లికార్జునరావు మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ఆమెకు అందజేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ సి.మల్లికార్జునరావు చర్మవిభాగం హెచ్‌వోడీగా పని చేశారు. అతని పేరిట నెలకొల్పిన గోల్డ్ మెడల్‌ను శ్రీవిద్యకు అందజేయనున్నట్లు ప్రకటించారు.

ఫిష్‌మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



కోలా గురువులును అభినందిస్తున్న మత్స్యకార సంఘాల నాయకులు

మహారాణిపేట : ఆరిలోవలో ఫిష్‌మార్కెట్ యార్డ్ నిర్మాణానికి మార్గం సుగమం అయింది. మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు చొరవతో నిర్మాణం చేపట్టేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు రూ. 10 లక్షలు మంజూరు చేసింది. దీంతో ఆరిలోవలో సుమారు 40 షాపులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కోలా గురువులు చేసిన కృషికి స్థానిక మత్స్యకారులు, మత్స్యకార సంఘ నాయకులు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం కోలా గురువులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గురువులును అభినందించిన వారిలో సిటీ మత్స్యకార సంఘం అధ్యక్షుడు కొక్కిలి గెడ్డ రాజావర్మ, శాంతినగర్ మత్స్యకార నాయకులు వాసుపల్లి అప్పన్న, గాంధీనగర్ మత్స్యకార నాయకులు రాగతి అచ్యుతరావు, నేషనల్ ఫిషరీస్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులు కొక్కిలిగెడ్డ వెంకటేశ్వరరావు ఉన్నారు.